
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
సోమవారం, 17 జూన్ 2024





	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	33	29
భద్రాద్రి	39	20

అధికారులంతా

సమర్ధవంతంగా పనిచేయాలి



- భద్రాద్రి కలెక్టర్‌గా జితేష్ వి. పాటిల్ బాధ్యతల స్వీకరణ
- ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీవోగా కూడా అదనపు బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్

కొత్తగూడెం/భద్రాచలం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా నూతన కలెక్టర్‌గా జితేష్ వి.పాటిల్ ఆదివారం ఉదయం ఐడీఓసీలోని తన చాంబర్‌లో తొలిసంతకం చేసి నూతన కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. నూతన కలెక్టర్‌కు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, అన్నిశాఖల జిల్లా అధికారులు పుష్పగుచ్ఛం అందచేసి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బదిలీ అయిన కలెక్టర్ ప్రియాంక అల పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ భద్రాద్రి జిల్లా లో పని చేసే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, లక్ష్యాల మేరకు సమన్వయం చేస్తూ ప్రజలకు సేవలు అందజేస్తానని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.



భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా వచ్చిన జితేష్ వి. పాటిల్

నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై చర్యలు

భద్రాచలం ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీవోగా కూడా అదనపు బాధ్యతలు స్వీకరించారు. కొత్తగూడెంలో ఆదివారం కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన భద్రాచలం విచ్చేసి రామయ్యను దర్శించుకొని భద్రాచలం ఐటీడీఏ కార్యాలయానికి వెళ్లి ఇన్‌చార్జ్ పీవోగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఐటీడీఏ యూనిట్ అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. విద్య, వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, ఐటీడీఏ యూనిట్ అధికారులు విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సహాయ ప్రాజెక్ట్ అధికారి డేవిడ్‌రాజు, డీఆర్‌డీవో విద్యాచందన, డీడీ మణెమ్మ, ఎస్‌వో సురేష్ బాబు, ఈఈ తానాజీ, ఆర్వీఎఫ్ఆర్ శ్రీనివాస్, ఏటీడీవో నర్సింగ్‌రావు, డీఎస్‌వో ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లాకు రావడం

అదృష్టంగా భావిస్తున్నా



- బాధ్యతలు స్వీకరించిన ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- కలెక్టరేట్‌లో ఘనస్వాగతం పలికిన అధికారులు

ఖమ్మం, జూన్16 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): కీలకమైన ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా సేవలందించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఈ జిల్లా అభివృద్ధికి గత కలెక్టర్ గౌతమ్ ఎంతో చేశారని, అంతకంటే ఒక అడుగు ముందుకేసి తాను జిల్లా అభివృద్ధికి కృషిచేస్తానని పేర్కొన్నారు. ఆదివారం కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఖమ్మం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులు, ఉద్యోగులనుద్దేశించి నూతన కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్రంలో కీలకమైన ఖమ్మం జిల్లాలో సేవలందించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఖమ్మం జిల్లాతో పాటు ఇక్కడ పనిచేస్తున్న అధికారుల బృందం గురించి ఎంతో విన్నానని, అద్భుతమైన ఈ టీంలో కష్టపడే తత్వం, సృజనాత్మకత ఉంటుందన్నారు. ఆఫీసర్లనుంచి అంతకంటే ఎక్కువగా ఏం ఆశిస్తామన్నారు. పూర్వ కలెక్టర్ గౌతమ్ జిల్లాలో అద్భుతంగా పనిచేశారని, అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ బాధ్యతగా ఒక అడుగు ముందుకేసి పనిచేస్తానన్న నమ్మకం తనకుందని వివరించారు. తనను ఆహ్వానించిన అధికారులు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఉదయం కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి వెళ్లి బదిలీపై వెళుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్ నుంచి కలెక్టర్ చాంబర్‌లో ముజమ్మిల్‌ఖాన్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కొత్త కలెక్టరేట్‌కు రాగానే జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాస్, డీఈవో సోమశేఖరశర్మ, డీపీఆర్వో గౌస్, ఆర్డీవోలు గణేష్, ఎల్. రాజేందర్ కలెక్టరేట్ ఏవో అరుణ, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్యాం ప్రసాద్ స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ కలెక్టరేట్‌లోనే తన చాంబర్‌కు వెళ్లి సీటుకు నమస్కరించి ఆసీనులయ్యారు అనంతరం ఉద్యోగులు అధికారులు ఆయనకు బొకేలు ఇచ్చి అభినందనలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మంత్రి తుమ్మలను ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.



ఆంధ్రప్రదేశ్‌లో అధికార మార్పిడితో ఆ రాష్ట్ర సరిహద్దులో ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పలువురిలో ఆశలు చిగురిస్తున్నాయి. గతంలో టీడీపీ హయాంలో ప్రతిపాదిత అమరావతి రాజధాని పరిధిలోని ప్రాంతాల్లో జిల్లాకు చెందిన అనేకమంది భూములు కొనుగోలు చేశారు. కానీ ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమరావతి నిర్మాణాన్ని పట్టించుకోకపోవటంతో అక్కడ భూములపై పెట్టుబడులు పెట్టినవారు తీవ్ర ఆందోళన చెందారు. జగన్ ప్రభుత్వ హయాంలో అక్కడ భూముల ధరలు కూడా భారీగా పడిపోయాయి. కానీ ఏపీలో మళ్లీ టీడీపీ కూటమి అధికారంలోకి రావటంతో అక్కడ భూములు కొన్న వారిలో ఆశలు చిగురిస్తున్నాయి.



అక్కడ మళ్లీ 'రియల్' భూం

- ఆంధ్రాలో టీడీపీ కూటమి విజయంతో చిగురిస్తున్న ఆశలు
- 'అమరావతి' పరిధిలో భూములు కొనుగోలు చేసిన జిల్లావాసులు
- జగన్ హయాంలో మూలనపడ్డ రాజధాని నిర్మాణం
- గత ప్రభుత్వ నిర్ణయంతో పడిపోయిన భూముల ధరలు
- టీడీపీ విజయంతో మళ్లీ భూముల ధరలకు రెక్కలు

సత్తుపల్లి, జూన్ 16: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ విడిపోయిన తరువాత 2014లో ఏపీలో నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడింది. హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా పదేళ్లపాటు కొనసాగే అవకాశం ఉన్నా చంద్రబాబు అమరావతి పేరుతో రాజధాని నిర్మాణం చేపట్టారు. దాంతో ఆ ప్రాంతంలో భూములు కొనుగోలు చేస్తే రాజధాని నిర్మాణం పూర్తయ్యేలోపుగానే భూముల ధరలు విపరీతంగా పెరుగుతాయని పలువురు భావించారు. ఈ క్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముఖ్యంగా సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలకు చెందిన వారితో పాటు ఖమ్మంలో కొందరు ప్రముఖులు ప్రతిపాదిత ఏపీ రాజధాని పరిసర ప్రాంతాల్లో భారీగా భూములు కొనుగోలు చేశారు. 2014లో అక్కడ ఎకరం రూ.40లక్షల నుంచి రూ.50లక్షలు ఉండగా రాజధాని శంకుస్థాపనలతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. 2015నాటికి ఎకరం రూ.80లక్షల నుంచి రూ.కోటి వరకూ పలికింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆంధ్రాలో భూములపై పెట్టుబడి రూ.150కోట్లపైనే ఉంటుందని అంచనా.

గ్రూపులుగా ఏర్పడి..

రాజధాని అమరావతి పరిసర ప్రాంతాల్లో భూముల ధరలు పెరుగుతుండటంతో పెట్టుబడులు పెట్టాలనుకున్న వారు జట్టుగా పెట్టుబడులు పెట్టారు. స్నేహితులు, బంధువులు గ్రూపులుగా ఏర్పడి అప్పట్లో పెద్ద మొత్తంలో భూములు కొనుగోలు చేశారు. భూములు కొనుగోలు చేసిన వారిలో కొందరు ప్రముఖ రాజకీయ నాయకులు, డాక్టర్లు, వ్యాపారవేత్తలు కూడా ఉన్నట్లు తెలిసింది. వీరితో పాటు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు భూములు కొన్నారు. రాజధానికి గరిష్టంగా 5 కిలో మీటర్ల దూరంలో భూములు ఎక్కువగా కొనుగోలు చేశారు. నూజివీడు సహా, తాటికొండ, వడ్లమాను, వైకుంఠాపురం, మందడం పలు గ్రామాల్లో భూములపై పెట్టుబడులు పెట్టారు. భూములతో పాటు అప్పటి ప్రభుత్వం అపార్ట్‌మెంట్లు నిర్మించి విక్రయించాలని నిర్ణయించింది. టెండర్ల ద్వారా అపార్ట్‌మెంట్‌లలో ప్లాట్లు విక్రయించింది. వీటిని కూడా సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతానికి చెందిన వారు కొనుగోలు చేశారు.

వైసీపీ ప్రభుత్వంలో పడిపోయిన భూముల ధరలు

2019లో జరిగిన ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ అధికారంలోకి రావటం వైఎస్.జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత మూడు రాజధానుల అంశం తెరపైకి తెచ్చారు. దీంతో అది కూడా ముందుకు సాగక టీడీపీ ప్రభుత్వం చేపట్టిన రాజధాని ప్రక్రియ పూర్తిగా మూలపడింది. దీంతో సహజంగానే ప్రతిపాదిత రాజధాని పరిసర ప్రాంతాల్లో భూముల ధరలు పడిపోయాయి. భూముల ధరలు వెంటనే పెరిగిపోతాయని, పెట్టిన పెట్టుబడులపై గణనీయమైన లాభాలుంటాయని ఆశించిన వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. వైఎస్.జగన్ అనుసరించిన విధానాల వల్ల భూముల ధరలు పడిపోయి అప్పులు తీరే దారి లేక కొందరు, వడ్డీ కూడా కలిసిరావటం లేదని మరికొందరు కొన్న ధర కంటే తగ్గించి అమ్ముకున్న ఉందతాలూ ఉన్నాయి. మరి కొందరు భూములను విక్రయించకుండా వేచి చూస్తూ వచ్చారు.

టీడీపీ కూటమి విజయంతో..

గత నెలలో జరిగిన ఎన్నికల్లో ఏపీలో అధికార మార్పిడి జరిగిన విషయం విదితమే. వైసీపీ ఘోర పరాజయంతో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. దీంతో గతంలో చంద్రబాబు చేపట్టిన రాజధాని పనులు మళ్లీ వేగం పుంజుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే మళ్లీ అక్కడ భూముల ధరలు పెరుగుతాయని (మిగతా 4వ పేజీలో)

భద్రాద్రిలో భక్తుల రద్దీ

- నిత్యకల్యాణంలో పాల్గొన్న 144 జంటలు
- రామయ్యను దర్శించుకున్న కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి.పాటిల్

భద్రాచలం, జూన్ 16: వరుస సెలవులు రావడంతో భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయానికి భక్తుల రాక పెరిగింది. వేకువజాము నుంచే భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి రామయ్య దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్నారు. నిత్యకల్యాణంలో 144 జంటలు పాల్గొన్నాయి. స్వామివారిని భద్రాద్రి జిల్లా నూతన కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీవో జితేష్ వి పాటిల్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు సంప్రదాయబద్ధంగా ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా శని, ఆదివారాల్లో స్వామివారికి వివిధ ఆర్జిత సేవలు, విరాళాలు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.28,70,452 ఆదాయం వచ్చింది. గత రెండు రోజుల్లో భద్రాద్రి రామయ్యను 25 వేల మంది దర్శించుకున్నారని అధికారులు అంచనా వేశారు.



త్యాగాలకు ప్రతీక బక్రీద్

నేడు బక్రీద్.. ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు

ఖమ్మంసాంస్కృతికం, జూన్ 16: ఇస్లాం మతంలో బక్రీద్ పండుగకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. త్యాగానికి చిహ్నంగా జరుపుకొనే బక్రీద్ పండుగకు ముస్లింలు అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. బకర్ ఈద్ పండుగ కాలక్రమేణా బక్రీద్‌గా రూపాంతరం చెందింది. ప్రవక్త ఇబ్రహీం తన కుమారుడు ఇస్మాయిల్‌ను త్యాగం చేసేందుకు సిద్ధపడిన సందర్భంలో అల్లాహ్ ప్రత్యక్షమై అతడిని వారిస్తాడు. ఇస్లాం క్యాలెండర్‌ను అనుసరించి జిల్హిజా మాసంలో పదో రోజున బక్రీద్‌ను పాటిస్తారు. త్యాగాలకు చిహ్నంగా జరుపుకొనే ఈద్‌ఉల్ అద్హా అనే పండుగను బక్రీద్ పేరిట జరుపుతారు. రంజాన్ పండుగ వెళ్లిన 70 రోజులకు వచ్చే ఈ పండుగ ముస్లింలకు ఎంతో విశిష్టమైనది. ఈ పండుగ తరువాత ముస్లింలు ఎంతో విశిష్టంగా భావించే హజ్ యాత్రలు మొదలవుతాయి. ప్రతి ముస్లిం జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలన్న నియమాన్ని అనుసరించి ఇస్లాం మతస్థులు ప్రణాళిక రూపొందించుకుంటారు. తాము చేయబోయే యాత్ర సమయంలో ఖుర్బానీ ఇవ్వటం సంప్రదాయం కనుక పండుగను ఈదుల్‌ఖుర్బానీ అనికూడా అంటారు. మూడు రోజులు జరిగే ఈ పండుగ సందర్భంగా తమ ప్రియమైన వస్తువులను త్యాగం చేయమని దేవుడు ఆజ్ఞాపించినట్లు ముస్లింలు నమ్ముతారు. బక్రీద్ ప్రార్థనల కోసం ఇరు జిల్లాల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



రైతుల అవసరమే అవకాశంగా..

- ఏజెన్సీలో పెట్టుబడి దందా
- చర్లలో పుట్టగొడుగుల్లా విత్తన, పురుగుమందుల దుకాణాలు
- కనిపించని ధరల పట్టికలు, స్టాక్ బోర్డులు
- వడ్డీల పేరుతో రైతుల నడ్డి విరుస్తున్న వ్యాపారులు

చర్ల, జూన్ 16: రైతుల అవసరాలను అవకాశంగా మార్చుకొని దందాలు సాగించవద్దని ఒక పక్క ప్రభుత్వం, అధికారులు హెచ్చరిస్తున్నా కొందరు వ్యాపారులు మాత్రం తమ పద్ధతి మార్చుకోవడం లేదు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో కొందరు ప్రైవేటు వ్యాపారులు రైతుల అవసరాలను తమ పెట్టిడికి అవకాశంగా మార్చుకుంటున్నారు. సాగు సీజన్ ప్రారంభం కావడంతో భద్రాద్రి జిల్లా చర్ల మండలంలో విత్తన, పురుగు మందుల దుకాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఎక్కడ చూసినా వ్యాపార సముదాయాలే కనిపిస్తున్నాయి. దుకాణాలు ఏర్పాటు చేస్తున్న కొంత మంది వ్యాపారులు అమాయక రైతులను టార్గెట్‌గా చేసుకొని అమ్మకాలు సాగిస్తున్నారు. "ముందు మీకు కావాల్సినవి పట్టుకుని పొండి.. తరువాత డబ్బులు ఇద్దురు గాని" అంటూ పురుగుల మందులు, విత్తనాలు, ఎరువులు అంటగడుతున్నారు. పంట చేతికొచ్చిన తరువాత వారు తీసుకున్న దానికి వడ్డీలు, చక్రవడ్డీలు వేస్తూ దోచుకుంటారు. రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసిన్నప్పుడు కొందరు వ్యాపారులు కనీసం బిల్లులు కూడా ఇవ్వడం లేదని తెలుస్తోంది. దుకాణాల ముందు, ధర పట్టికలు, స్టాక్ వివరాలు ఎక్కడా కనిపించడం లేదు. రికార్డులు కూడా సరిగా నిర్వహించడం లేదు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారులు చర్లలో దుకాణాలను తనిఖీ చేయాలని కోరుతున్నారు.

పుట్టగొడుగుల్లా దుకాణాలు

చర్ల మండలంలో గతంలో కొన్ని విత్తన, పురుగు మందుల దుకాణాలు మాత్రమే ఉండేవి. నేడు వాటి సంఖ్య విపరీతంగా పెరిగి పోయింది. ప్రస్తుతం చర్ల మండలంలో 26 పంచాయతీల్లో సుమారు 40నుంచి 45దుకాణాలపైగా కనిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో తేగడ, ఆర్‌కొత్తగూడెం, పెద్దమిడిసిలేరు, చర్ల, కొత్తూరు, వీరాపురం ఇతర ప్రాంతాల్లో దుకాణాలను ఏర్పాటు చేశారు. ఇలా ఏర్పాటు అయిన కొత్త, పాత దుకాణాల్లో వడ్డీల పేరుతో వస్తువులను రైతులకు అమ్ముతున్నారు. అసలు ధరకన్నా అధికంగా వాటిని విక్రయిస్తూ దానిపై కూడా వడ్డీలు విధిసున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కనిపించని ధరల పట్టికలు, స్టాక్ బోర్డులు

ప్రతీ దుకాణంలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల వివరాలను స్టాక్ రిజిష్టర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అలాగే షాపులో ఉన్న సరుకు ధరల వివరాలు కూడా బయట బోర్డుల్లో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ చర్ల మండలంలోని దుకాణాల్లో ఇవి ఏమాత్రం కనిపించడం లేదు. దీనివల్ల దుకాణానికి వచ్చిన రైతులకు పూర్తి వివరాలు తెలియకుండా పోతోంది. అలాగే అసలు రిజిష్టర్‌లు కూడా పూర్తిస్థాయిలో నిర్వహించడం లేదని తెలుస్తోంది. కొంత మంది వ్యాపారులు ఇష్టానుసారంగా ఎరువులు, పురుగు మందులు ఇతర చోట్ల నిల్వచేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇక అనుమతులు లేకుండా బయోమందుల అమ్మకాలు కూడా జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. ఆర్‌కొత్తగూడెం, పాత చర్లలో ఈ దందా ఎక్కువ సాగుతోంది.



మోటమర్రిలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

'ధరణి'తో భూకబ్జాలకు అవకాశమిచ్చారు

- రెవెన్యూ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తాం
- గ్రామసభల ద్వారా విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- విద్యుత్ సమస్యల పరిష్కారానికి 1912 టోల్ ఫ్రీ నెంబర్
- బోనకల్ మండల పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

బోనకల్, జూన్ 16: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ధరణి పోర్టల్‌తో కొందరు పెద్దలకు ప్రభుత్వ భూములను కాజేసే వెసులుబాటు కల్పించారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. బోనకల్ మండలంలోని మోటమర్రి, పెద్దబీరవల్లి, తూటికుంట్ల గ్రామాల్లో ఆదివారం ఆయన రూ.4.86కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ముందుగా మోటమర్రిలో అంకమ్మతల్లి దేవాలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలో పలు రహదారులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ గ్రామసభల ద్వారా విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. విద్యుత్ సమస్యలపై టోల్‌ఫ్రీ నెంబర్ 1912ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూ సదస్సులతో పాటు జమాబందీ నిర్వహించలేదన్నారు. భూశిస్తులను కట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తుందని రైతులకు భరోసా ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల్లో గత ప్రభుత్వ విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్వరరెడ్డి కోరినట్లుగానే విద్యుత్ కొనుగోళ్ల అంశంపై జ్యూడీషియల్ విచారణ కమిటీని వేశామన్నారు. ఇందులో ఎవ్వరి జోక్యం ఉండదన్నారు. జ్యూడిషియల్ కమిటీ చైర్మన్‌కు విచారణార్హత లేదని మాజీ సీఎం కేసీఆర్ చెప్పడాన్ని ఆయనకు న్యాయ వ్యవస్థపై నమ్మకం లేనట్లుగా భావించాల్సి వస్తుందన్నారు. తాను చెప్పిందే వేదం, తాను చెప్పినట్లే నడవాలంటే ఇది రాచరిక వ్యవస్థ కాదన్న విషయాన్ని కేసీఆర్ గుర్తుంచుకోవాలని భట్టి హితవు పలికారు.

పలు సమస్యలపై ప్రజల వినతులు

తూటికుంట్ల గ్రామంలో సీపీఎం నాయకులు తుళ్లూరి రమేష్, పాపినేని రాంనర్సయ్య తదితరులు తమ గ్రామంలో ప్రత్యేకంగా సొసైటీని ఏర్పాటు చేయాలని, స్మశానవాటికకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతిపత్రాలను అందజేశారు. గ్రామీణ వైద్యులు తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. పలు గ్రామాల ప్రజలు రోడ్లు, తదితర సమస్యలకు సంబంధించి వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరావు, ట్రాన్స్‌కో ఎస్ఈ సురేందర్, పీఆర్ ఎస్ఈ చంద్రమౌళి, ఈఈ వెంకటరెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన ఖమ్మం కలెక్టర్

» బాగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని ముజామ్మిల్‌ఖాన్‌కు మంత్రి తుమ్మల సూచన

ఖమ్మం,జూన్16(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ముజామ్మిల్‌ఖాన్ ఆదివారం మధ్యాహ్నం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ మంత్రి తుమ్మలను కలిసి సమావేశమయ్యారు. అనంతరం కొద్దిసేపు ముచ్చటించారు. తుమ్మల కొత్త కలెక్టర్‌ను శాలువాతో సత్కరించారు. జిల్లా అభివృద్ధికి కష్టపడి బాగా పనిచేయాలని మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రభుత్వ పాలన మరింత పకడ్బందీగా నిర్వహించాలని, నగరంలో ప్రజలు అధికంగా ఉన్న నేపథ్యంలో ఖమ్మం అర్బన్ మండలాన్ని రెండు మండలా లుగా చేయాలని సూచించారు. జిల్లాలో జరుగుతున్న ప నులను వేగవంతం చేయాలని, జాతీయ రహదారులు, సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనులకు అవసరమైన భూసేకరణ పనులను రైతులను ఒప్పించి చట్టప్రకారం చేపట్టాలని కోరారు. అలాగే ప్రభుత్వ వక్ఫ్ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని ఎక్కడైనా అన్యాక్రాంత మైన ప్రభుత్వ



కలెక్టర్‌ను సత్కరిస్తున్న మంత్రి తుమ్మల

భూములు ఆస్తులను రికవరీ చేయాలని,, అర్హులైన పేదలందరికి ఇళ్లపట్టాలు ఇచ్చేలా చొరవ తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు.అనంతరం కలెక్టర్‌కు తుమ్మల కార్యాలయంలో ఉన్న వీ వెంకటాయపాలెం సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదబాబు, ముదిగొండ సొసైటీ అధ్యక్షుడు తుపాకుల యలగొండస్వామి తదితరులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

అక్కడ మళ్లీ 'రియల్' భూం

(3వ పేజీ తరువాయి)
అంచనాలు వేస్తున్నారు. ఏపీ రాజధాని ప్రతిపాదిత పరిసర ప్రాంతాల్లో భూములు కొని ఇప్పటికే తొమ్మిదేళ్లు గడిచిందని, పెట్టుబడులకు సంబంధించి వడ్డీ లెక్కిస్తే ఇప్పటికిప్పుడు లాభాలు వచ్చే అవకాశం లేదని, రాబోయే రోజుల్లో మంచి ఫలితం ఉంటుందని చెబుతున్నారు.

తొమ్మిదేళ్ల క్రితం భూమి కొన్నాం

గుడిపూడి గాంధీ, సత్తుపల్లి



ఏపీ రాజధాని ప్రతిపాదన జరిగిన వెంటనే ఆ ప్రాంతంలో మిత్రులతో కలిసి భూమి కొనుగోలు చేసాం.. ఆంధ్రాలో వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే రాజధాని నిర్మాణం నిలిపివేయటం, ఉద్యమాలు నేపథ్యంలో భూముల ధరలు ఆశించిన మేర పెరగలేదు. దీంతో కొన్న ధరకే అమ్ముకోలేక ఎదురుచూస్తూ వచ్చాం.. తాజాగా అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మళ్లీ రాజధాని నిర్మాణం ప్రారంభిస్తే పరిస్థితి కొంత ఆశాజనకంగా మారే అవకాశం ఉంటుందని ఆశిస్తున్నాం.

రాజధానిపైనే ఆశలు..

- జి.రాము, సత్తుపల్లి



గతంలో ప్రతిపాదించిన అమరావతి రాజధాని తిరిగి నిర్మాణం కొనసాగిస్తే ఆ ప్రాంతంలో భూముల ధరలు పెరిగే అవకాశం ఉంది. స్నేహితులతో కలసి కొద్ది మొత్తంలో భూమి కొన్నాం. జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత తీసుకున్న నిర్ణయంతో మేము కూడా ఇబ్బంది పడ్డాం. రాబోయే రోజుల్లో పరిస్థితి ఆశాజనకంగా ఉంటుందని భావిస్తున్నాం. గతంలో అక్కడ భూములు కొన్నవారు కొందరు ఆర్థిక ఇబ్బందుల కారణంగా తక్కువ ధరకే అమ్ముకున్నారు.

పడిపోయిన భూముల ధరలు

కూసంపూడి మురళీధరరావు, సత్తుపల్లి



రాజధాని పరిసర గ్రామాల్లో భూములు కొనుగోలు చేసిన వారు పెట్టుబడులు కూడా రాక ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సి వచ్చింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు వడ్లమాను, వైకుంఠాపురం తదితర గ్రామాల్లో సిండికేట్‌గా భూములు కొనుగోలు చేశారు. ఆంధ్రాలో ప్రభుత్వ మార్పిడి, అక్కడి ప్రభుత్వ నిర్ణయం కారణంగా తాము ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ప్రస్తుతం కూటమి విజయం, చంద్రబాబు తిరిగి అధికారంలోకి రావటంతో రాజధాని ప్రక్రియ వేగవంతం అయ్యే అవకాశం ఉంది. భూముల ధరలు పెరుగుదలపై ఆశగా ఉన్నాం.

తలసీమియా చిన్నారులకు అన్ని విధాల సహకారం

» ఏసీపీ ఎస్వీ రమణమూర్తి » 'సంకల్ప' ఆధ్వర్యంలో బాధిత చిన్నారులకు మందులు పంపిణీ


రక్తదాతలను సత్కరిస్తున్న దృశ్యం

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 16: తలసీమియాతో బాధపడుతున్న చిన్నారులకు పోలీసుశాఖ అండగా నిలుస్తుందని ఖమ్మం టౌన్ ఏసీపీ ఎస్వీ రమణమూర్తి అన్నారు. ఆదివారం సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తలసీమియా చిన్నారులకు రక్తాన్ని అందించే రక్తదాతలు, రక్తదాన శిబిరాలు నిర్వహించే వారిని సన్మానించి, చిన్నారులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖ ద్వారా తలసీమియా చిన్నారులకు గతంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశామని, భవిష్యత్‌లో కూడా రక్తం కొరత లేకుండా చూస్తామని తెలిపారు. నగరంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు. రక్తదానం చేస్తున్న దాతలను అభినందించారు. తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (టాటా) ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కన్నారపు ప్రసాద్ ఈ నెల చిన్నారుల మందుల కోసం అసోసియేషన్ తరుపున సంకల్ప సంస్థకు రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ప్రసాద్ మాట్లాడుతూ భవిష్యత్ కాలంలో తలసీమియా చిన్నారుల సంరక్షణ కోసం సంకల్ప సంస్థకు అండగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రక్తదాతలు బోస్ యాదవ్, కాంగ్రెస్ యువజన సంఘం నాయకులు జె.అంజని, జి.సతీష్, జి.నాగరాజు, తదితరులను శాలువాలతో సత్కరించి, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.నారాయణ మూర్తి, సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, పి.రవిచందర్, పి.అనిత, పి.ఉదయ్‌భాస్కర్, బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఊరు సుభిక్షం కోసం

ఒక రోజంతా గ్రామం ఖాళీ..

» గిరిజన గ్రామాల్లో అనాధిగ వస్తున్న ఆచారం » గ్రామం విడిచి వలసవెళ్లిన తిరుమలకుంట ప్రజలు


వనంలో దేవుళ్లను ఏర్పాటు చేసి పూనకాలు పడుతున్న భక్తులు

అశ్వారావుపేట, జూన్ 16: గిరిజన గ్రామాలలో పంట వేసిన నాటి నుంచి పంట చేతికొచ్చేవరకు, వేసవిలో భూమి పండగలు, కొత్తలు, వలసలు వంటి ఎన్నో ఆచారాలతో కూడిన పండుగలు వారి జీవనశైలిలో ఓ బాగంగా మారాయి. జీవితంలో జరిగే ప్రతి సంఘటనను గిరిజనులు ఓ వేడుక రూపంలో చేస్తుంటారు. అలాంటిదే 'వలసలు' పండుగ. గ్రామం సుభిక్షం కోరుతూ గ్రామస్థులంతా కలసి ఒక రాత్రి, పగలు మేళతాళాలతో దేవుళ్ళను ప్రతిష్ఠింపచేసి గ్రామంలోని పిల్లపాప, వృద్దులు, పశువులు, కోళ్ళు, పెంపుడు జంతువులతో సహా గ్రామం అంతా ఒక పగటి పూటంతా గ్రామాన్ని పూర్తిగ వదిలేసి సమీపంలోని వనం(తోటల్లోకి)మకాం వెళ్ళి పోతారు. అంటే గ్రామం ఒక రోజంతా ఖాళీగ ఉంటుంది. గ్రామంలోని వాళ్ళంతా వనంలోకి వలసలు వెళ్ళి అక్కడ దేవుణ్ణి ప్రతిష్ఠింపచేసి, అక్కడే వంటలు చేసుకొని, మొక్కులు తీర్చుకొని ఆట పాటలతో రోజంతా వనాల్లోనే గడుపుతారు. ఆ రోజంతా గ్రామానికి విశ్రాంతి నిస్తారు. దీనిని గిరిజనులు 'వలసలు పండుగ అంటారు' ఆదివారం మండల పరిధిలోని తిరుమలకుంట అనే గిరిజన గ్రామంలోని ప్రజలు పూర్తిగ గ్రామాన్ని ఖాళీ చేసి సమీపంలోని వనాల్లోకి వలసలు వెళ్ళారు. గ్రామస్థులు వనాల్లో దేవుణ్ణి ప్రతిష్ఠించి మొక్కులు తీర్చుకున్నారు. సామూహికంగా వంటలు చేసుకొని భోజనాలు చేసారు. చీకటి పడే సమయానికి అందరు తిరిగి ఇంటికి వచ్చి దీపాలు వెలిగించుకొని ఇళ్ళల్లో వంటలు చేసుకున్నారు. ఇలా చేస్తే గ్రామ సుభిక్షంగ ఉంటుందని, గ్రామంలో చీడపీడలు పోతాయని గిరిజనుల నమ్మకం.

బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక


ప్రారంభిస్తున్న ఏసీపీ వెంకట్రావు

ఖమ్మం స్పోర్ట్స్, జూన్ 16: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలోని ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే జిల్లా బ్యాడ్మింటన్ జట్లను ఎంపిక చేశారు. ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 100 మంది క్రీడాకారులు టీంలుగా హజరైయ్యారు. ఎంపికలను రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఏసీపీ ఘంటా వెంకట్రావు పటిల్ ఆడి ప్రారంభించారు. ఎంపికలలో భాగంగా క్రీడాకారులకు అండర్- 11, 13, 15, 17, 19, బాలురు, బాలికల విభాగాలతో పాటు మెన్ అండ్ ఉమెన్ ఏజ్ గ్రూప్ విభాగాలలో టోర్నీ కమ్ సెలెక్షన్స్ నిర్వహించారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి ఎన్. ఉప్పల్‌రెడ్డి తెలిపారు. ఎంపికలను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ బాధ్యులు తమ్మినేని వెంకట్రావు, చంద్రశేఖర్ తదితరులు సమీక్షించారు.

తాగునీటి కోసం వెతలు

వైరా, జూన్ 16: మండలంలోని విప్పలమడకలో మంచినీటి పథక బోరులో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. ఫలితంగా మోటార్‌లో సాంకేతిక సమస్య తలెత్తుతుంది. నాలుగు రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. విప్పలమడకతోపాటు నారపనేనిపల్లి, లింగన్నపాలెం గ్రామాలకు చెందినవారు తాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. మిషన్ భగీరథ పథకం నుంచి ఈ గ్రామాలకు అరకొరగానే తాగునీరు సరఫరా అవుతుంది. అవి ఏమూలకు సరిపోవడం లేదు. ప్రతి నిత్యం ఈ మూడు గ్రామాల ప్రజలు విప్పలమడకలో పంచాయతీకి చెందిన తాగునీటి పథకం తాగునీటిపైనే ఆధారపడుతున్నారు. మంచినీటి బోరులో పూర్తిగా భూగర్భజలాలు అడుగంటిపోయాయని పంచాయతీ సిబ్బంది చెబుతున్నారు. బోర్‌లో నీళ్ల లేని సమయంలో మోటర్ వేయడం వలన వేడెక్కి సాంకేతిక సమస్య ఏర్పడుతుంది. ప్రతి పదినిమిషాలకోసారి మోటర్ ఆగిపోతుండటంతో మంచినీరు అందని పరిస్థితి ఉంది. ఈ ట్యాంకు దగ్గర మంచినీళ్ల కోసం ప్రజలు బారులు తీరి


ట్యాంకుల వద్ద క్యాన్లు, బిందెలతో తాగునీటి కోసం వేచి ఉన్న ప్రజలు

నిలబడుతున్నారు. వెంటనే అధికారులు జోక్యం చేసుకొని తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఈ గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి వి.రామకృష్ణ తాగునీటి ఎద్దడిపై స్పందించారు. సోమవారం సాయంత్రంలోగా మోటర్‌కు మరమ్మతులు చేయించి ఉన్న నీటిని ట్యాంకుల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తామని తెలిపారు.

మత సామరస్యాలకు ప్రతీకగా

దక్షిణ అయోధ్య నిలవాలి

» భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ

భద్రాచలం, జూన్ 16: దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం పుణ్యక్షేత్రం మత సామరస్యాలకు ప్రతీకగా నిలవాలని ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఆకాంక్షించారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా ఎఎస్‌పీ కార్యాలయంలో ఆదివారం హిందు, ముస్లిం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. బక్రీద్‌ను ముస్లిం సోదరులందరూ భక్తిశ్రద్దలతో జరుపుకోవాలని, వారందరికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే హిందువులు మతసామరస్యంకు సహకరించి సోదరభావంతో మెలగాలని కోరారు. దశాబ్దాల కాలంగా దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల పుణ్యక్షేత్రంలో హిందు ముస్లింలు పరస్పర స్నేహ భావాలతో ఉంటున్నారని, ఇదే స్ఫూర్తిని మున్ముందు సైతం కొనసాగించి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మధుతో పాటు హిందు, ముస్లింలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

గిరిజనులకు నా చేతనైనంత సహకారమందించా

● బదిలీపై వెళ్లిన ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ ● సన్మానించిన ఐటీడీఏ ఉద్యోగులు


బదిలీపై వెళ్తున్న పీవోను సన్మానిస్తున్న అధికారులు

భద్రాచలం, జూన్ 16: ఐటీడీఏ యూనిట్ అధికారులు, ఆదివాసీ యూనియన్ నాయకుల సహకారంతో మారుమూల ప్రాంత ఆదివాసీ గిరిజనులకు నా చేతనైనంత సహాయ సహకారాలు అందించానని వికారాబాద్ కలెక్టరుగా బదిలీపై వెళ్లిన ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ పేర్కొన్నారు. శనివారం రాత్రి ఐటీడీఏ కార్యాలయంలో అధికారులు సిబ్బంది ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించారు. పీవో ప్రతీక్‌జైన్ మాటాడుతూ 11 నెలలు గిరిజనుల కోసం సేవ చేసే భాగ్యం తనకు కలిగిందని, గిరిజన రైతులకు కరెంటు, మోటారు సౌకర్యం కల్పించడం, అర్హులైన ప్రతి గిరిజనుడికి ఆర్థిక సహాయం అందించడానికి కృషి చేసానని అన్నారు. గిరిజన విద్యాభివృద్ధికి, ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించానని పేర్కొన్నారు. ఈ 11 నెలల కాలం ఇంత సులభంగా గడిచిపోతుందని నేను అనుకోలేదని, గిరిజన సంక్షేమం కోసం చేయాల్సిన పనులు ఇంకా మిగిలి ఉన్నాయని తప్పనిసరిగా ఏదో ఒక రోజు వస్తానని అన్నారు. అనంతరం యూనిట్ అధికారులు, సిబ్బంది జిల్లా కలెక్టరుగా బదిలీపై వెళ్తున్న ప్రతీక్‌జైన్‌కు చిరు సత్కారం చేసి అభినందనలు తెలిపారు.

ఆలపాటికి ఎమ్మెల్యే జారే అభినందనలు


ఆలపాటి ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట, జూన్ 16: ఆయిల్‌పాం అడ్వైజరీ కమిటి సభ్యుడిగా ఆలపాటి రాంచంద్రప్రసాద్‌ను ప్రభుత్వం నియమించటం పట్ల అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హర్షం వ్యక్తం చేసారు. అల్లిపల్లిలో అయన నివాసంలో ఆదివారం సాయంత్రం ఆలపాటి రాంచంద్రప్రసాద్‌ను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కలిసి అభినందించి సత్కరించారు. ఆలపాటిని సత్కరించిన వారిలో ఎంపిపి సోయం ప్రసాదు, సొసైటి చైర్మన్ ఎల్లిన రాఘవరావు, పామాయిల్ సంఘం డైరెక్టర్ కొయ్యల అచ్చుతరావు, రావు గంగాధరరావు , కేవి సత్యనారాయణ, దొడ్డా బాస్కరావు, దొడ్డా చిన సత్యం, పోతినేని శ్రీరామ వెంకట్రావు, కూకుల కుంట రమేష్, కక్కిరాల రమేష్, పగడాల రాంబాబు, బొబ్బిలి వెంగళరావు, నందమూరి సూర్యారావు, నాగప్రసాదు, వసంతరావు, బొల్లి కొండ నాగేశ్వరరావు, రాయల నాగేశ్వరరావు, ప్రసాదు ఎంపీటీసీ వెంకట్రావు వున్నారు.

జూలై 27, 28 తేదీల్లో

ఖమ్మంలో ఏబీఏపీ జాతీయ సమావేశాలు

● రాష్ట్ర కార్యదర్శి టీవీ పుల్లం రాజు



మాట్లాడుతున్న టీవీ పుల్లంరాజు

ఖమ్మంసాంస్కృతికం, జూన్ 16: అఖిలభారత అయ్యప్ప ధర్మప్రచారసభ తెలంగాణ రాష్ట్ర, జాతీయ జనరల్ బాడీ సమావేశాలు జూలై నెల 27, 28 తేదీల్లో ఖమ్మంలో జరుగుతాయని ఈసందర్భంగా రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకుంటారని అయ్యప్ప ధర్మప్రచార సభ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి టి. పుల్లం రాజు అన్నారు. సమావేశాల్లో పాల్గొనేందుకు పలు రాష్ట్రాలనుంచి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఆదివారం ఖమ్మంలోని గోపాలపురంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, హనుమకొండ, జనగాం, మంచిర్యాల, పెద్దపల్లి, ఆసిఫాబాద్, నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు హాజరయ్యారు. ఈసందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూలై 27న ఖమ్మంలో 2024-26 సంవత్సరాలకు నూతన కమిటీ ఎన్నిక, రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం తోపాటు 28న జాతీయ జనరల్ బాడీ సమావేశం ఉంటుందన్నారు. సమావేశాల్లో పాల్గొనేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, రాష్ట్రాల నుంచి జాతీయ కమిటీల సభ్యులు హాజరవుతారని తెలిపారు.

కార్మిక హక్కుల కోసం పోరాడండి

» టీపీటీఎఫ్ నేత రాయల రవికుమార్



మాట్లాడుతున్న రాయల రవికుమార్

ఖమ్మంసాంస్కృతికం, జూన్ 16: కార్మికుల హక్కుల సాధనకోసం ఐఎఫ్‌టీయూ పోరాడు తోందని ఆ పోరాట స్ఫూర్తితో మరిన్ని హక్కుల సాధనకోసం పోరాడాలని టీపీటీఎఫ్ నాయకులు రాయల రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఏరియా ఉపాధ్యక్షుడు ములకలపల్లి లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ కార్మిక వర్గం నిరంతరం చైతన్యంతో పోరాడాలన్నారు. యాజమాన్యాల నిరంకుశ చర్యలను ఎప్పటికప్పుడు ఎదరించాలన్నారు. మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని ఇది మరో బానిసత్వానికి నిదర్శణమన్నారు. 126 సంవత్సరాల క్రితం కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులపై కేంద్ర రాష్ట్ర పాలకులు దాడి చేస్తున్నారని ఆరోపించారు. ఐ ఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏ. వెంకన్న, కార్యదర్శి జి . రామయ్య మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐ ఎఫ్ టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆవుల అశోక్, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి టి. ఝాన్సీ, ఐ ఎఫ్ టీయూ ఏరియా నాయకులు కె. శ్రీనివాస్, ధరావత్ సక్రు, పేరబోయిన వెంకన్న తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు ఐఎఫ్‌టీయూ పతాకాన్ని నగర ఉపాధ్యక్షుడు ములకలపల్లి లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు.

స్వచ్ఛభారత్ లక్ష్యానికి తూట్లు

» నిరుపయోగంగా డీఆర్‌సీ సెంటరు

ఇల్లెందుటౌన్, జూలై 16: స్వచ్ఛభారత్ లక్ష్యానికి మున్సిపాలిటీ అధికారులు తూట్లు పొడుస్తున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మంగా చేపట్టిన స్వచ్ఛభారత్‌లో భాగంగా ఇల్లెందు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో డీఎంఎఫ్‌టీ (డిస్టిక్ మినరల్ డెవలప్‌మెంట్ ఫండ్స్) నిధులు కోటి రూపాయల వ్యయంతో నిర్మాణం చేసిన డీఆర్‌సీ (డ్రై రిసోర్స్ సెంటర్) అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది. తడి చెత్తనుంచి వర్మీ కంపోస్టు తయారీతోపాటు పొడిచెత్తను వేరే చేసేందుకు ఏర్పాటు చేసిన ఈ కేంద్రం సంవత్సరకాలంగా తాళాలు తెరుచుకోవడం లేదు. వర్మింకపోస్టు తయారీతోపాటు ప్లాస్టిక్ వస్తువుల విక్రయాల ద్వారా ఎంతో కొంత ఆదాయాన్ని గడించేందుకు కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ అధికారుల అలసత్వంతో నిరుపయోగంగా మారింది. పట్టణంలో వివిధ వివిధ వార్డులో సేకరించిన తడి, పొడిచెత్తలను డీఆర్‌సీ కేంద్రానికి తరలించి అక్కడ వర్మీ కంపోస్టుతోపాటు ఇతర చర్యలు చేపట్టాల్సి ఉండగా గత సంవత్సర కాలంగా ఈ చర్యలన్నీ అధికారులు నిలిపివేయడం గమనార్హం. స్వచ్ఛభారతద్వారా మున్సిపాలిటీ పరిధిలో సుమారు 20 స్వచ్ఛ ఆటోలతో ప్రతిరోజు వార్డులో చెత్త సేకరణ చేయాల్సి ఉండగా గతంలో మాదిరిగా తడి, పొడిచెత్తను వేరు చేసి తీసుకునే



తాళాలు వేసిన డీఆర్‌సీ భవనం, రోడ్డు వెంబడి వేసిన చెత్త

విధానానికి స్వస్తి పలికారు. వరుస ఎన్నికలతోపాటు ఇతర కారణాలను అధికారులుచెప్తున్నప్పటికీ మున్సిపల ఇంజనీరింగ్ విభాగంతోపాటు ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు కావడండో డీఆర్‌సీ భవనానికి తాళాలు పడ్డాయి. ఆదాయాన్ని పెంపొందించే దిశగా అధికారులు అడుగులు వేయకపోవడం పలు విమర్శలకు దారి తీస్తోంది. గత సంవత్సరం తడిచెత్తద్వారా తయారైన వర్మీ కంపోస్టు అమ్మకాల మూలంగా సుమారు రూ.80వేల వరకు సమకూరినప్పటికి వర్మీ కంపోస్టు తయారీని విస్మరించడం సరికాదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైన అధికారులు డీఆర్‌సీ కేంద్రాన్ని తెరిచి వర్మీకంపోస్టు తయారు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

త్వరలో వర్మీ కంపోస్టును తయారు చేస్తాం

యాదగిరి, మునిసిపల్ కమిషనర్



డీఆర్‌సీ సెంటరులో త్వరలోనే వర్మీ కంపోస్టు తయారు చేస్తాం. పూర్తిస్థాయి లో సెంటరులో పనులు ప్రారంభిస్తాం. పూర్తిస్థాయి సిబ్బందిని కేటాయిస్తాం. వర్మీ కంపోస్టు అమ్మకాలు తిరిగి ప్రారంభిస్తాం.

అనుబంధాల విలువ చాటిన 'కపిరాజు'..

» లెనిన్ స్మారక గీతం ఆవిష్కరణ


నాటిక ప్రదర్శన దృశ్యం

ఖమ్మంసాంస్కృతికం, జూన్ 16: నెలనెల వెన్నెల సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా భక్త రామదాసు కళాక్షేత్రంలో న్యూస్టార్ మోడ్రన్ థియేటర్స్ విజయవాడ కళాకారులు ప్రదర్శించిన కపిరాజు నాటిక మృగ్యమవుతున్న నైతిక విలువలను ఎత్తి చూపింది. ఇతిహాస కాలం నుంచి బంధాలు, అనుబంధాలకు గల ప్రాధాన్యతను కళ్లకు కట్టినట్లు కళాకారులు ప్రదర్శించారు. రామాయణ కాలంలో వాలి సుగ్రీవుల మధ్య వైరం, రామలక్ష్మణుల అనుబంధం తదితర మాన వ సంబంధాలను వివరిస్తూ నాటిక సాగింది. డాక్టర్ రవి మారుత్, బత్తిని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బత్తిని నాగప్రసాద్, డాక్టర్ కావ్య చంద్ యాలమూడి తదితరులు అతిధులుగా హాజరైన ఈకార్యక్రమంలో నెలనెల వెన్నెల నిర్వాహకులు సుబ్రమణ్య కుమార్, జగన్మోహనరావు, డాక్టర్ హెచ్ విశ్వనాథ్, డాక్టర్ నాగబత్తిని రవి, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


లెనిన్ గీతం ఆవిష్కరిస్తున్న దృశ్యం

లెనిన్ స్మారక గీతం ఆవిష్కరణ..

లెనిన్ శత వర్ధంతి కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఖమ్మంలో లెనిన్ స్మారక గీతావిష్కరణ జరిగింది. భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న నెలనెల వెన్నెల కార్యక్రమంలో పాట ఆవిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లాకు చెందిన సీనియర్ కవి, వామపక్ష అభ్యుదయవాది జీవన్ ఈ గీతాన్ని రచించారు. లెనిన్‌ను భవిష్యత్ తరాలు స్మరించుకోవటం, కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అజరామరం చేయటం గీతం ధ్యేయమని రచయిత జీవన్ తెలిపారు. ప్రజా గాయకుడు మేడగాని శేషగిరి అద్భుతంగా ఆలపించిన ఈగీతానికి అభిజ్ఞ సంగీతం అందించారు. ఈపాట సీడీని విద్యావేత్త ఐవీ రమణారావు ఆవిష్కరించారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- విదేశాలకు భారీ వాహనాల ఎగుమతి
- అదుపులోకి తీసుకున్న వరంగల్ పోలీసులు
- 70 లక్షల విలువైన ఐదు కార్లు స్వాధీనం

మట్టెవాడ, జూన్ 16: ఫైనాన్షియర్ల ముసుగులో కార్లు, టిప్పర్లు, జేసీబీ వంటి భారీ వాహనాలను మోసపూరితంగా కొనుగోలు చేసి నెదర్లాండ్, దక్షిణాఫ్రికా, కాంబోడియా వంటి దేశాలకు విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి తెలిపారు. ఆదివారం వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తురకలకుంట గ్రామానికి చెందిన వరికుప్పల దశరథ్, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం వసంతనగర్ చిన్నదుర్గం నందాన్, రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మండలం జగద్గిరిగుట్టకు చెందిన కౌశెట్టి రాకేశ్, హైదరాబాద్ సంతోష్‌నగర్ ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ జాబీర్‌లు ఈ దందాకు తెరలేపారన్నారు. వీరు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో... ఆర్థిక ఇబ్బందుల కారణంగా భారీ వాహనాలు అమ్మకానికి పెట్టుకున్న కొంతమంది యజమానుల నుంచి వాహనాలు కొనుగోలు చేసేవారని చెప్పారు. వాటికి సంబంధించిన ఈఎంఐలు తామే కడతామని నమ్మించేవారన్నారు. అలా కొన్ని వాహనాలను ఇతరులకు విక్రయించడమో లేక స్క్రాప్ కింద అమ్మడమో చేసేవారని వివరించారు. అలాగే ముంబాయిలోని కొన్ని బృందాల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేవారని డీసీపీ వెల్లడించారు. ముఠా సభ్యులు గతంలో హైదరాబాద్ పోలీసులకు పట్టుబడి సుమారు 16 నెలలు జైలుకు వెళ్లారని, విడుదలయ్యాక కూడా అదే తరహాలో నేరాలకు పాల్పడుతున్నారని స్పష్టం చేశారు. 2023లో వరంగల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సుమారు నాలుగున్నర కోట్ల విలువైన వాహనాలను మోసపూరితంగా తీసుకొని నెదర్లాండ్, సౌతాఆఫ్రికా, కాంబోడియా లాంటి దేశాలకు ఎగుమతి చేశారని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున వరంగల్ హనుమాన్‌జంక్షన్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకొని, 5 కార్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

'నాలా' ఎలా?



(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాలి. ధరణి రాక ముందు ఆర్డీవో స్థాయిలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేస్తూ నాలా చార్జీలు వసూలు చేసే వారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో భూముల విలువ ఆధారంగా 5శాతం, జీహెచ్ఎంసీ పరిధిలో 9శాతం చొప్పున తీసుకునేవారు. కానీ, తెలంగాణ ఏర్పాటు తర్వాత ధరణిని తీసుకొచ్చిన అప్పటి ప్రభుత్వం.. నాలా చార్జీలు చెల్లించేందుకు తొలుత ఆప్షన్ ఇవ్వలేదు. ఆ తర్వాత ఇచ్చినా.. ధరణిలో నమోదై ఉండి, ఎకరాలు, గుంటల చొప్పున నమోదై ఉన్న భూములకు మాత్రమే అవకాశం కల్పించింది. అనధికార లేఅవుటల్లో గజాల చొప్పున ఓపెన్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అలాంటి ఆప్షన్ లేకుండా పోయింది. ఉదాహరణకు ఒక ఊరి శివారులో వ్యవసాయ భూమి ఉంటే.. ధరణిలో అది ఫలానా సర్వే నంబర్‌లో ఉందని పేర్కొంటూ దాని విస్తీర్ణం ఎకరాలు, గుంటల్లో ఉంటుంది. ప్రస్తుతం ఇలాంటి భూమిని మాత్రమే వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసుకునే వీలుంది. గతంలోనే లేఅవుట్‌గా మార్చి, సదరు భూమిని గజాల చొప్పున వేర్వేరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి ఉంటే.. ధరణిలో అది హౌసింగ్ సైట్ అనే పేరుతో చూపిస్తోంది. ఇలాంటి భూమికి నాలా చార్జీలు చెల్లించే అవకాశం లేకుండా పోయింది. దీంతో దశాబ్దాల క్రితం భూములు కొనుగోలు చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆప్షన్ లేక సతమతం..

గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాల్లో దశాబ్దాల క్రితమే పెద్దఎత్తున అనధికార లేఅవుట్లు వెలిశాయి. వాటిలో ఓపెన్ ప్లాట్లను వేలాది మంది కొనుగోలు చేశారు. ఆయా స్థలాల్లో భవన నిర్మాణ అనుమతులకు వెళ్లిన సందర్భంలో భూమి విలువలో ఎల్ఆర్ఎస్ చార్జీల కింద 30శాతం, నాలా చార్జీల కింద మరికొంత వసూలు చేసే వారు. దీనికితోడు జీహెచ్ఎంసీ పరిధిలోనైతే చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) పేరిట చార్జీలు తీసుకునేవారు. అయితే, తెలంగాణ ఏర్పాటు తర్వాత హెచ్ఎండీఏలో భవన నిర్మాణ అనుమతుల కోసం వెళ్లినప్పుడు కేవలం ఎల్ఆర్ఎస్ చార్జీలు మాత్రమే తీసుకుంటున్నారు. సదరు స్థలానికి నాలా చార్జీలు చెల్లించకపోతే.. ఆ ఫీజు చెల్లించి పత్రాన్ని తీసుకురావాలని సూచిస్తున్నారు. ధరణి వచ్చిన తర్వాత గుంటలు, ఎకరాల్లో ఉన్న భూముల కన్వర్షన్‌కు మాత్రమే ఆప్షన్ ఇచ్చిన ప్రభుత్వం... గజాల్లో ఉన్న స్థలాలకు సంబంధించిన ఆప్షన్ ఇవ్వకపోవడంతో చిన్న, మధ్య తరహా డెవలపర్లు, బిల్డర్లు తీవ్రంగా సతమతమవుతున్నారు. ఈ విషయమై గత ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ అసోసియేషన్ల ప్రతినిధులు అనేక మార్లు సంప్రదించినా.. ఫలితం దక్కలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి.. గజాల్లో ఉన్న స్థలాలకూ నాలా చార్జీలు తీసుకొని, భవన నిర్మాణ అనుమతులు ఇప్పించాలని వారు కోరుతున్నారు. దీన్ని అమలు చేస్తే ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్లకుపైగా ఆదాయం వస్తుందని పేర్కొంటున్నారు.

సమస్యను పరిష్కరించాలి

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని అనధికార లేఅవుట్లలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు పదేళ్లుగా పలువురు డెవలపర్లు, బిల్డర్లు ప్రయత్నం చేస్తున్నారు. కానీ అనుమతులు రాకపోవడంతో ఆయా స్థలాలన్నీ నిరుపయోగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వంలో ధరణి తీసుకొచ్చి అదనపు చార్జీలను విధించి ఆదాయాన్ని పొందేందుకు రకరకాల మార్గాలను అప్పటి అధికారులు అన్వేషించారు. కానీ, ఆదాయం వచ్చే మార్గాలను గాలికి వదిలేసి.. ఉన్న చార్జీలను పెంచే ప్రయత్నం చేశారు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి రియల్ ఎస్టేట్ రంగానికి గుదిబండగా మారిన నాలా సమస్యను పరిష్కరించాలి.

- ఎం.ప్రేమ్‌కుమార్,
వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్

ఏఎఫ్‌సీఎస్‌పై నిరాధార ఆరోపణలు: టీజీఎస్‌ఆర్టీసీ

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం(ఏఎఫ్‌సీఎస్)పై నిరాధార ఆరోపణలు తగదని టీజీఎస్‌ఆర్టీసీ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు మేరకే ఏఎఫ్‌సీఎస్‌ను అమలు చేస్తున్నట్లు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. డిజిటల్ టికెటింగ్ కోసం సాంకేతికను అందిపుచ్చుకునేందుకు కేంద్రం రూ.20.97 కోట్లను విడుదల చేసిందని పేర్కొన్నారు. ఏఎఫ్‌సీఎస్ కోసం 2022 నవంబరు 2న టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఇంటెలిజెంట్ టికెట్ యంత్రాల సరఫరా, డిజిటల్ టికెటింగ్, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, నిర్వహణకు కావాల్సిన సర్వర్లు, మ్యాన్‌పవర్‌పై 'ఛలో' మొబిలిటీకి బాధ్యతలను అప్పగించాలని కమిటీ ప్రతిపాదించినట్లు వివరించారు. బస్సుల్లో యూపీఐ, డెబిట్/క్రెడిట్ కార్డులతో డిజిటల్ పేమెంట్స్, స్మార్ట్‌కార్డ్, మొబైల్ టికెట్స్, మొబైల్ బస్‌పాస్ సౌకర్యం కల్పించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుకు మహిళలకు స్మార్ట్‌కార్డ్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు ఛలో మొబిలిటీ అనుభవం ఉపయోగపడుతుందని గుర్తించామన్నారు. దాంతో మార్చి 15న ఛలో మొబిలిటీకి లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్‌వోఐ) ఇచ్చామని తెలిపారు. కొన్ని డిపోల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తామని, అన్ని డిపోల్లో అమలుకు మూడు నెలల సమయం పడుతుందని వివరించారు. అసోం, బిహార్ రాష్ట్రాలతోపాటు.. ముంబై, ఇండోర్, జబల్‌పూర్ నగరాల్లో ఈ వ్యవస్థ కొనసాగుతోందని, ఒక్క ముంబైలోనే ఛలో మొబిలిటీ ద్వారా 11 లక్షల స్మార్ట్‌లు జారీ అయ్యాయని పేర్కొన్నారు.

సైబర్ బాధితులకు రూ.31.29 కోట్లు రికవరీ

- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్

హైదరాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా మోసపోయిన బాధితులకు రూ.31.29 కోట్ల సొమ్మును రికవరీ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీఎస్ఎల్ఎస్ఏ), టీజీసీఎస్‌బీ సంయుక్తంగా తీసుకున్న చర్యల వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీ నుంచి జూన్ 8 వ తేదీ వరకు రెండు లోక్‌అదాలత్‌లతో కలిపి రూ.31.29 కోట్లు రికవరీ చేసినట్లు ఆయన వివరించారు. సైబర్ మోసాలకు సంబంధించి నాలుగునెలల్లోనే కోర్టుల్లో 5,142 పిటిషన్లు నమోదు అయ్యాయని తెలిపారు. సైబర్ నేరాలపై టీజీసీఎస్‌బీ తక్షణమే స్పందిస్తూ బాధితుల సొమ్మును సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా చర్యలు తీసుకుంటున్నదని శిఖాగోయల్ చెప్పారు. సైబర్‌నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్మును బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేస్తున్నప్పటికీ బాధితులకు తిరిగి అందించడంలో ఆలస్యం అవుతోందని ఆయన అన్నారు. ఇలాంటి కేసులను సీఆర్‌పీసీ సెక్షన్ 457 కింద నమోదు చేయడంతో పాటు దర్యాప్తునకు సంబంధించి స్టాండర్డ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)లను తయారు చేసి అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలకు పంపినట్లు శిఖాగోయల్ తెలిపారు.

యువకుడి ఉసురుతీసిన.. ఆన్‌లైన్ బెట్టింగ్

- 3 రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం.. ఆస్పత్రిలో ఆదివారం మృతి



భాను(ఫైల్)

రామాయంపేట, జూన్ 16: ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ యువకుడి ప్రాణాలు తీసింది. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం దర్మారం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన దొమ్మాట భాను(24) డిగ్రీ పూర్తి చేసి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి రూ.2 లక్షల దాకా నష్టపోయాడు. దీంతో మనస్తాపం చెంది మూడు రోజుల క్రితం తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబీకులు వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్ తెలిపారు.

164 కిలోల గంజాయి, 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు సీజ్

- వేర్వేరు కేసుల్లో ఏడుగురి అరెస్టు



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిక పెరుమాళ్, ఏసీపీ శ్రీనివాసరావు

హైదరాబాద్ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఒడిసా నుంచి హైదరాబాద్‌కు గుట్టుగా గంజాయి తరలిస్తున్న రెండు అంతర్రాష్ట ముఠాలకు చెందిన ఆరుగురిని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 164 కిలోల గంజాయి, మూడు కార్లు, ఓ బైక్, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మి పెరుమాళ్ సీసీఎస్‌లో ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. హుమాయున్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మొత్తంలో గంజాయి దిగుమతి అవుతుందనే సమాచారంతో దాడి చేసిన పోలీసులు ఓ ముఠాను పట్టుకుని వారి వద్ద వంద కిలోల గంజాయిని సీజ్ చేశారు. కామారెడ్డి జిల్లా పిట్లాంకు చెందిన ధారావత్ రవి, మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన సయ్యద్ బహదూర్, ఆనంద్ రామ్‌జీ కదమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ప్రధాన నిందితుడు ధారావత్ రవి ఇటీవల ఒడిశా వెళ్లి అక్కడ ఓ రైతు దగ్గర 100 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. దానిని 32 ప్యాకెట్లుగా మార్చి బహదూర్, ఆనంద్ రామ్‌జీ సహకారంతో కారులో హైదరాబాద్‌కి తరలించి పోలీసులకు పట్టుబడాడు. మరో కేసులో ఇదే తరహాలో ఒడిసా నుంచి నగరానికి గంజాయి తీసుకొచ్చిన హైదరాబాద్‌కు చెందిన షేక్ సర్వేజ్, అబ్దుల్ రవూఫ్, మహ్మద్ అన్వర్ అరెస్టయ్యారు. వారి నుంచి 64 కిలోల గంజాయిని చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన షేక్ పర్వేజ్ గతంలో రాజమండ్రి జైలులో శిక్ష అనుభవించాడు. ఇటీవల బయటికొచ్చిన పర్వేజ్ ఒడిసా వెళ్లి జైలులో అతనికి పరిచయమైన గంజాయి రైతు దీపక్‌ను కలిశాడు. దీపక్ నుంచి 64 కిలోల గంజాయి తీసుకుని రవూఫ్, అన్వర్‌తో కలిసి హైదరాబాద్‌కు తీసుకొచ్చి పోలీసులకు చిక్కాడు. మరో కేసులో యూపీ నుంచి హైదరాబాద్‌కు గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని శేరిలింగంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ పరిధిలో పార్టీలు, ఈవెంట్లలో తనిఖీలు చేసిన ఎక్సైజ్ పోలీసులు 8 మత్తు పదార్థాల ప్యాకెట్లను సీజ్ చేశారు.

వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ముగ్గురి మృతి

మధిరటౌన్, జూన్16: ఎదురెదురుగా రెండు ద్వి చక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. వైరా మండలం నారపనేనిపల్లికి చెందిన కనకపూడి జోజి(45) మధిరలో ఉంటూ ఆర్టీసీ అద్దె బస్సుకు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాగా ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లి ఇంటికి వస్తుండగా, కృష్ణాపురానికి చెందిన భూక్యా ప్రసాద్‌కు చెందిన ద్వి చక్ర వాహనం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో జోజి అక్కడికక్కడే మృతి చెందగా, ప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. టౌన్‌ఎస్ఐ సంధ్య కేసు నమోదు చేశారు.

దమ్మపేటలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడు

దమ్మపేట: ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం నల్లకుంట గ్రామసమీంలో చోటు చేసుకుంది. ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం అల్లిపల్లి గ్రామానికి చెందిన చిలకా నాగేశ్వరరావు(25) అనే యువకుడు ద్విచక్రవాహనంపై గొల్లగూడెం వెళుతుండగా, నల్లకుంట సమీపంలోని మలుపు వద్ద బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకున్న సిబ్బంది మృతి చెందినట్లుగా ధ్రువీకరించారు. పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

లారీకి టార్పాలిన్ కడుతుండగా డ్రైవర్

మధిరరూరల్: మధిర మండలం కృష్ణాపురం గ్రామం వద్ద గుర్తుతెలియని డీసీఎం వ్యాన్ ఢీకొని ఆదివారం రాత్రి ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన పమ్మిశెట్టి గోపి(32)అనే లారీ డ్రైవర్ మృతిచెందాడు. ఆదివారం రాత్రి పదిన్నర గంటల సమయంలో మధిర నుంచి వైరా వైపు బొగ్గులోడ్‌తో లారీ వెళ్తుంది. ఈ లారీకి టార్పాలిన్ పట్టా వేసిన తాడు ఊడిపోయింది. లారీ డ్రైవర్‌గా ఉన్న తమ్మిశెట్టి గోపి లారీ దిగి ఆతాడును కడుతుండగా వైరా నుంచి మధిర వైపు వెళ్తున్న గుర్తుతెలియని డీసీఎం వ్యాన్ వేగంగా వచ్చి డ్రైవర్ గోపిని ఢీకొట్టింది. దీంతో గోపికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న మధిర ఆర్కే రెస్క్యూటీం దోర్నాల రామకృష్ణ ఆధ్వర్యంలో మధిర ఆసుపత్రికి తరలిస్తుండగానే గోపి మార్గమధ్యలో మృతి చెందాడు.

అనారోగ్యంతో న్యాయవాది నిమ్మల కన్నుమూత



సోమిరెడ్డి(ఫైల్)

అశ్వాపురం, జూన్ 16: మండల కేంద్రమైన అశ్వాపురానికి చెందిన ప్రముఖ న్యాయవాది నిమ్మల సోమిరెడ్డి(75) కొంత కాలంగా శ్వాసకోశ వ్యాధితో బాధపడుతూ ఆదివారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ కన్నుమూశారు. సోమిరెడ్డి 1980వ దశకంలో అశ్వాపురం కేంద్రంగా నక్సలైట్ ఉద్యమంలో చంద్ర పుల్లారెడ్డి వర్గంలో జిల్లా కార్యదర్శిగా పని చేసి, అశ్వాపురం మణుగూరు బూర్గంపాడు పరిసర గ్రామాల ప్రజలకు అన్నగా సుపరిచితుడయ్యాడు. జైలు జీవితం కూడా అనుభవించాడు. అనంతరం కొత్తగూడెం కోర్టులో 1990దశకంలో న్యాయవాది వృత్తిని చేపట్టి గుర్తింపును పొందారు. కొత్తగూడెంలోనే స్థిరపడిన ఆయనకు భార్య కుమారుడు ఉన్నారు. కొత్తగూడెంలోనే సోమిరెడ్డి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సత్తుపల్లి కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గారావు..



దుర్గారావు(ఫైల్)

సత్తుపల్లి, జూన్16: సత్తుపల్లి కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిపూడి దుర్గారావు (78)ఆదివారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దుర్గారావు సత్తుపల్లిలో 60 సంవత్సరాలుగా మెడికల్ షాప్ వ్యాపారంలో ఉన్నారు. 40 సంవత్సరాలుగా కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడుగా పనిచేస్తున్నారు. దుర్గారావు మృతి పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, కెమిస్ట్ డ్రగ్గిస్ట్ సత్తుపల్లి అసోసియేషన్ బాధ్యులు సంతాపం ప్రకటించారు. కాగా అంత్యక్రియలు నేడు ఏ కొండూరు మండలం కోడూరు గ్రామంలో జరగనున్నాయి.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె



తండ్రికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న కూతురు

మధిరరూరల్, జూన్ 16: మధిర మండలం మాటూరుపేట గ్రామంలో కుమార్తె తన తండ్రికి తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది. మధిర మండలం మాటూరుపేట గ్రామంలో ధనిశెట్టి అప్పారావుకు ఇద్దరు కుమార్తెలున్నారు. అప్పారావు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. పెద్ద కుమార్తె అయిన రాజేశ్వరి తండ్రి కర్మకాండలు చేసి తలకొరివి పెట్టింది. ఈ ఘటనను చూసి పలువురు కంటతడి పెట్టారు.

మానవత్వం చాటుకున్న కలెక్టర్

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను తనకారులో ఆస్పత్రికి తరలించిన భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్



క్షతగాత్రులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ పాటిల్

బూర్గంపాడు, జూన్ 16: భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దర్శనానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో బూర్గంపాడు మండల పరిధిలోని మణుగూరు క్రాస్ రోడ్డు సమీప అటవీ ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. అటువైపుగా వెళ్తూ ప్రమాదాన్ని గమనించిన కలెక్టర్ తన వాహనాన్ని ఆపారు. క్షతగాత్రులను కలెక్టర్ వాహనంతో పాటు 108వాహనంలో స్వయంగా ఎక్కించి ఆసుపత్రికి తరలించారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే మానవత్వం చాటుకున్న ఆయన తీరుపట్ల స్థానికులు సోషల్‌మీడియా వేదికగా ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్16: కొత్తగూడెం మెడికల్‌కళాశాలలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాద్రి జిల్లా ఉపాధి కల్పన అధికారి వేల్పుల విజేత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 23 కేటగిరిలలో 155 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ పోస్టులకు 10వ తరగతి నుంచి గ్రాడ్యుయేట్, డిప్లొమ, డీఎంఎల్‌టీ, బీఎస్సీ ఎంఎల్‌టీ, ఐటీఐ, ఎలక్ట్రీషన్ ప్లంబర్, హెవీ డ్రైవింగ్ లైసెన్సు వంటి విద్యర్హతలుగా నిర్వహించినట్లు తెలిపారు. అర్హులైన ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 18వ తేదీ నుంచి ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఈ దరఖాస్తులను ఐడీవోసీలోని ఎస్-27లో గల జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో అందించాలని అన్నారు. ఈ అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు పూర్తిగా ప్రతిభ ఆధారంగానే నియామకం చేపడతామని పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం దళారుల మాటలు మోసపోవద్దని సూచించారు.

చంద్రన్న గెలుపు.. అభిమాని పాదయాత్ర

- మణుగూరు టీడీపీ వీరాభిమాని విజయవాడకు 210 కిలోమీటర్ల పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న నాగేశ్వరరావుకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

పాల్వంచ టౌన్, జూన్ 16 : ఇటీవల జరిగిన ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ మిత్రపక్ష కుటమి విజయ ఢంకా మోగించి చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని మణుగూరుకు చెందిన టీడీపీ వీరాభిమాని మేదరమెట్ల నాగేశ్వరరావు విజయవాడకు పాదయాత్ర చేపట్టాడు. తన పాదయాత్ర ఆదివారం పాల్వంచకు చేరగా విషయం తెలిసిన స్థానిక టీడీపీ నాయకులు బస్టాండ్ సెంటరులో పూలమాలలు వేసి పాదయాత్రకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు ఆంధ్రజ్యోతి పలుకరించగా ఇటీవల ఏపీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ గెలిచి చంద్రబాబు సీఎం అయితే విజయవాడకు మణుగూరు నుంచి కాలినడకన వచ్చి దుర్గమ్మకు మొక్కు చెల్లిస్తానని మొక్కుకున్నానని తెలిపారు. అమ్మవారి దయతో తాను అనుకున్న కోర్కె నెరవేరడంతో శనివారం మధ్యాహ్నం మణుగూరు నుంచి తనయాత్ర ప్రారంభించానని అన్నారు. సుమారు 210 కిలోమీటర్ల తన పాదయాత్ర సాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో చంద్ర రవి, ఆలపాటి ప్రసాద్, పొందూరి నర్సింహారావు, ఎస్. శివ ప్రసాద్, కర్నాటి వేణు, చనుమోలు శ్రీనివాసరావు, రత్తయ్య తదితరులున్నారు.

హెచ్-142 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కేవీ



కేవీని సన్మానిస్తున్న యూనియన్ సభ్యులు

పాల్వంచ, జూన్ 16: హెచ్-142 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా పాల్వంచ కేటీపీఎస్ 7వ దశకు చెందిన కేవీ రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పాల్వంచ కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని యూనియన్ ప్రాంతీయ కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర అధ్యక్షుడు ఖాజామొయినుద్దీన్ మరణంతో ఆ పదవిని భర్తీ చేయాలని సమావేశం నిర్ణయించింది. దీంతో సమావేశానికి హాజరైన సెంట్రల్ కార్యవర్గం నుంచి నామినేషన్లను పిలుస్తూ తీర్మానించారు. ప్రస్తుతం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవిలో ఉన్న కేవీ రామారావు పేరును ఇద్దరు సభ్యులు ప్రతిపాదించగా, మరో ఇద్దరు సభ్యులు బలపరిచారు. అనంతరం మరెవరి పేరును ఎవ్వరూ ప్రతిపాదించకపోవడంతో ఎన్నిక ఏకగ్రీవమయ్యింది. అనంతరం రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకటరెడ్డి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ 33 ఏళ్లుగా కార్మికుల పక్షాన నిలబడి అనేక ఉద్యమాలు చేశానని, వాటన్నింటినీ గుర్తించి తనకు అధ్యక్ష పదవి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్-142 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు, కేటీపీఎస్ ఇరు కర్మాగారాల నాయకులు పాల్గొన్నారు.

హైవోల్టేజీతో గృహోపకరణాల దగ్ధం

- రూ.5లక్షలకు పైగా ఆస్తి నష్టం
- తనికెళ్లలో ఘటన
- సబ్‌స్టేషన్ ఎదుట బాధితుల ఆందోళన





తనికెళ్లలో ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధితులు, ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కొణిజర్ల, జూన్16: విద్యుత్ హైవోల్టేజీ కారణంగా ఇండ్లలోని ఎలక్ట్రానిక్కు పరికరాలు కాలిపోయిన సంఘటన మండల పరిధిలోని తనికెళ్లలో చోటుచేసుకుంది. బాధిత ప్రజలు ఆదివారం తనికెళ్ల సబ్‌స్టేషన్ వద్ద, గ్రామసెంటర్‌లలో ఆందోళన వ్యక్తం చేసి విద్యుత్‌శాఖ ఏఈ సురేష్‌కి జరిగిన నష్టం పై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గ్రామ సెంటర్ నుంచి శివాలయం వరకు సుమారు 50 ఇండ్ల వరకు శనివారం రాత్రి ఆకస్మాత్తుగా ఇండ్లలోనే టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీలు, ఫ్యాన్లు, తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు హైవోల్టేజీతో కాలిపోయాయని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం చూసుకుంటే ఏ ఒక్కటి పనిచేయక కాలిపోయి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం వలనే కాలిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.5లక్షలకు పైగా నష్టం జరిగిందని వాపోయారు. జరిగిన నష్టాన్ని ఎవరు ఇస్తారని అధికారులను ప్రశ్నించారు. ఈ విషయం పై ఏఈ సురేష్ మాట్లాడుతూ ఉరుములు, మెరుపులు వలన ట్రాన్స్‌ఫార్మర్‌లో హైవోల్టేజీ సరఫరా అయి ఇలా హైవోల్టేజీతో కాలిపోతాయని, ఇది ప్రకృతి వైపరీత్యం అని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా పరిశీలించామని బాగానే ఉందన్నారు. గ్రామ ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. నష్టపోయిన బాధితుల్లో 32మంది సంతకాలు చేసి ఎవరికి ఎంత నష్టం జరిగిందో వినతిద్వారా ఏఈకి అందజేశారు.

గోవధను అడ్డుకున్న పోలీసులు

● ఆలస్యంగా వెలుగులోకి....

నేలకొండపల్లి, జూన్16: మండల పరిధిలోని బోదులబండ గ్రామంలో గోవధను చేసేందుకు కొంత మంది ప్రయత్నించగా గ్రామస్థుల సమాచారంతో నేలకొండపల్లి పోలీసులు అడ్డుకున్నారు. వివరాల ప్రకారం.. బోదులబండ ఎస్సీ కాలనీలో శనివారం రాత్రి కొంత మంది గోవధ చేసేందుకు సిద్ధం చేయగా గమనించిన స్థానికులు ఖమ్మం సీపీకి సమాచారం అందించారు. సీపీ ఆదేశాల మేరకు శనివారం రాత్రి నేలకొండపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి గోవధను అడ్డుకున్నారు. ఆవును మద్దులపల్లిలోని గోశాలకు తరలించినట్లు సమాచారం.

పాము కాటుతో వ్యక్తి మృతి

దమ్మపేట,జూన్16: పాముకాటుకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలోని నల్లకుంటలో చోటు చేసుకుంది. నల్లకుంట గ్రామానికి చెందిన సున్నం పరమేష్(63) శనివారం బహిర్భూమికి వెళ్లగా పాము కాటు వేసింది. ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు విషయం చెప్పడంతో దమ్మపేట వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కొత్తగూడెం వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ: ఆరుగురికి గాయాలు

బూర్గంపాడు, జూన్ 16: ఆటో, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఆరుగురు గాయపడిన ఘటన ఆదివారం మణుగూరు క్రాస్ రోడ్డు సమీపంలో చోటు చేసుకుంది. పాల్వంచ నుంచి నలుగురు ప్రయాణికులను ఎక్కించుకుని ఆటో భద్రాచలం వైపునకు వెళ్తుండగా, మండల పరిధిలోని మణుగూరు క్రాస్ రోడ్డు సమీప అటవీ ప్రాంతం వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. దీంతో ఆటోలో ఉన్న ఐదుగురితో పాటు ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను భద్రాచలం తరలించారు. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని, క్షతగాత్రుల వివరాలు సేకరిస్తున్నట్లు అదనపు ఎస్ఐ నాగభిక్షం తెలిపారు. ఆటోలోని ప్రయాణికులు ఏపీలోని ఎటపాక మండలానికి చెందిన వారుగా తెలుస్తోంది.

ఘనంగా పూజా కార్యక్రమాలు



ఖమ్మంసాంస్కృతికం, జూన్ 16: కాల్వొడ్డులోని శ్రీసత్యనారాయణ సహిత వీరాంజనేయస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం ఆలయంలో శ్రీసత్యనారాయణస్వామి, శ్రీ సీతారామచంద్రస్వామిలకు నిత్యహోమం, విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో వీవీ నరసింహారావు, అర్చకులు పాల్గొన్నారు.

నగర పాలక సంస్థలో

రెవెన్యూ విభాగం అస్తవ్యస్తం

- రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేసేందుకు విముఖత
- సంబంధంలేని శాఖల అధికారులకు బాధ్యతలు

ఖమ్మంకార్పొరేషన్, జూన్16: నగర పాలకసంస్థ కార్యాలయంలో రెవెన్యూ విభాగంలో అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు వస్తున్నాయి.రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా (ఆర్‌ఐ) కొత్తగా బాధ్యతలు చేపట్టినవారు విధుల నిర్వహణలో విముఖత చూపించటంతో ఫైళ్లు భారీగా పేరుకు పోతున్నట్లు తెలుస్తోంది. గతంలో ఆర్‌ఐలుగా పని చేసిన వారిపై అవినీతి ఆరోపణలు రావటంతో వారిని నగర పాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి వేరే విభాగాలకు మార్చారు. కొత్తవారికి ఆర్‌ఐలుగా బాధ్యతలు అప్పగించారు. కాగా రెవెన్యూ విధులతో సంబంధం లేనివారికి ఆర్‌ఐలుగా విధులు కేటాయించటంతో వారు అయోమయానికి గురవుతున్నారు. గతంలో ఉన్న ఆర్‌ఐలను తొలగించటంతో ఏం చేస్తే ఏం జరుగుతుందో అనే భయంతో విధులను సరిగా నిర్వహించటం లేదని తెలుస్తోంది.



అవగాహన లేక..

సంబంధంలేని శాఖల అధికారులకు రెవెన్యూ విభాగం బాధ్యతలు అప్పగించటంతో ఇబ్బందులు ఎదురవు తున్నాయి. అక్కౌంట్స్, ఆడిట్ విభాగంలో పనిచేసే అధికారికి రెవెన్యూ అధికారి బాధ్యతలు అప్పగించారు. ఇంటి నెంబర్లు కేటాయింపు, ఇతర పనులపై అవగాహన లేకపోవటంతో ఫైళ్లను పెండింగ్‌లో ఉంచుతున్నట్లు తెలుస్తోంది. సదరు అధికారి డిప్యుటేషన్‌పై ఖమ్మం నగర పాలకసంస్థ కార్యాలయానికి రాగా, సదరు విభాగంలో ఉన్న అధికారి బదిలీ కావటంతో ఇక్కడే పోస్టింగ్‌ను ఖరారు చేశారు. అయితే బదిలీ అయిన అధికారి తిరిగి రావటంతో సమస్య మొదలయింది. దీంతో డిప్యుటేషన్‌పై ఉన్న అధికారికి ఆర్‌ఐ బాధ్యతలు అప్పగించారు. అలాగే నగర పాలకసంస్థ మేనేజర్‌గా పనిచేస్తున్న వ్యక్తికి ఆర్‌ఐ బాధ్యతలు అప్పగించారు. తాను ఈ విధులు చేయలేనని కమిషనర్‌కు మొరపెట్టుకున్నా లాభం లేకపోయింది. ఇక ఇంజనీరింగ్ విభాగంలోని డ్రాయింగ్‌బ్రాంచ్‌లో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్‌కు, ఒక బిల్‌కలెక్టర్‌కు ఆర్‌ఐ బాధ్యతలు అప్పగించారు.

రెవెన్యూ విభాగంపై అవినీతి ఆరోపణలతో...

ఇంటినెంబర్ల కేటాయింపుపై రెవెన్యూ విభాగంపై అవినీతి ఆరోపణలు రావటం, పలువురిని వేరే విభాగాలకు మార్చటంతో ఆర్‌ఐల బాధ్యతలు అంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. అయితే బలవంతంగా బాధ్యతలు అప్పగించటంతో భయంతోనే విధులు నిర్వహిస్తున్నారు. కాగా ఫైళ్లను పరిష్కరించటంతో ఆచితూచి వ్యవహరించటంతో పనుల్లో తీవ్రజాప్యం జరుగుతుందనే విమర్శలు ఉన్నాయి. ఈ విభాగం అస్తవ్యస్థం కావటంతో పనులు కాక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు చెబుతున్నారు.

అదే అదునుగా...

వేరే విభాగాలకు చెందినవారు, రెవెన్యూ విభాగంపై అవగాహన లేనివారిని ఆర్‌ఐలుగా నియమించటంతో కొందరు బిల్‌కలెక్టర్లు ఇదేఅదునుగా అవినీతికి పాల్పడు తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ఇంటినెంబర్ల కేటాయింపులో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. సెల్ఫ్ అసెస్‌మెంట్ కాకుండా తామే నిర్మాణ కొలతలు తీసుకుంటామని చెబుతూ, నిర్మాణదారుల నుంచి సొమ్ములు వసూలు చేస్తున్నట్లు బహిరంగంగానే అంటున్నారు. నగరపాలకసంస్థ కార్యాలయంలో ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉండటంతో ఉన్న వారినే సర్దుబాటు చేస్తున్నారు. ఉద్యోగులను అదనంగా నియమిస్తేనే రెవెన్యూ విభాగం ప్రక్షాళన అయ్యే ఆవకాశం ఉంది.

గ్రామాభివృద్ధికి దాతల సహకారం అవసరం

- వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- గంగారంలో బస్‌షెల్టర్ ప్రారంభం

సత్తుపల్లి, జూన్16: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటుతో పాటు దాతల సహకారం అవసరమని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సత్తుపల్లి మండలం గంగారంలో దాసరి వీరారెడ్డి, లక్ష్మీస్వరాజ్యమ్మల జ్ఞాపకార్థం కుమారుడు దాసరి వెంకట్రామిరెడ్డి (చిట్టినాయన) ఆర్థిక సహకారంతో నిర్మించిన బస్‌షెల్టర్ ఆయన సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి ప్రారంభించారు. దాతలను అభినందిస్తూ గ్రామంలో ఎన్నో మంచి పనులకు ఆర్థిక సహకారం అందిస్తున్న దాసరి కుటుంబ సభ్యులను తుమ్మల అభినందించారు. అనంతరం మునిసిపల్ మాజీచైర్మన్ దొడ్డాకుల స్వాతి, గోపాలరావు దంపతుల



బస్‌షెల్టర్‌ను ప్రారంభిస్తున్న తుమ్మల

మనవడు 21వరోజు వేడుకకు తుమ్మల హాజరై దీవించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన మాజీ జడ్పీటీసీ హసావత్ లక్ష్మీ అల్లుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీనియర్ నాయకులు రామిశెట్టి సుబ్బారావు సతీమణి మృతిచెందగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి కుటుంబాన్ని ఓదార్చారు.

రామాలయానికి భగవద్గీత పుస్తకాల పంపిణీ

వైరా, జూన్ 16: మండలంలోని కొండకొడిమ గ్రామంలో ఉన్న రామాలయానికి ఏపీలోని జగ్గయ్యపేటకు చెందిన ఆదినారాయణ 70భగవద్గీత, రామాయణం, భాగవతం పుస్తకాలను ఆదివారం అందజేశారు. అలాగే హిందూ ధర్మపరిరక్షణ సమగ్ర పూజా విధానానికి సంబంధించిన పుస్తకాలను కూడా అందజేశారు. ఆలయ చైర్మన్ కొప్పుల వెంకట కృష్ణారావు, కార్యదర్శి బోణాల వీరభద్రరావు, అనంతరామయ్య పాల్గొన్నారు.



మాతృమూర్తివలే పిల్లలను ఆదరించిన మాలతి

సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

సత్తుపల్లిరూరల్, జూన్16: వేలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన మాదిరాజు మాలతి మాతృమూర్తివలే పిల్లలను ఆదరించారని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లి మండలం సదాశివునిపేట ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు మాదిరాజు మాలతి పదవీ విరమణ చేయగా ఆమెను పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం, బంధుమిత్రుల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక జే కన్వేన్షన్ హాల్‌లో ఘనంగా సన్మానించారు. పాఠ్య పుస్తకాల బోధనకే పరిమితమవ్వకుండా అమ్మలాంటి మనసుతో పిల్లలను తన అక్కున చేర్చుకున్న మాలతి ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. విద్యార్థులను మాతృభాషలో తీర్చిదిద్దడం కోసం పలు శతకాలను నేర్పించడంతో పాటు భర్త శేషగిరిరావుతో కలిసి సాహిత్య రంగానికి ఎనలేని కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా మాలతి, శేషగిరిరావు



మాలతి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

దంపతులను ఎమ్మెల్యే రాగమయి దయానంద్ దంపతులు జ్ఞాపికలు, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యా నోడల్ అధికారి నక్కా రాజేశ్వరరావు, కాంప్లెక్స్ చైర్మన్ శైలకుమారి, సంఘ నాయకులు వీ.చెంచురెడ్డి, వేణుగోపాలరెడ్డి, చెన్నకేశవరెడ్డి, చెరుకు శ్రీనివాసరావు, సత్యనారాయణరెడ్డి, చిత్తలూరి ప్రసాద్, రియాజ్, మట్టా అజయ్‌కుమార్, మధుసూదనా చారి, మధుసూదనరాజు పాల్గొన్నారు.

బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి

- పోలీసుకమిషనర్ సునీల్‌దత్

ఖమ్మంక్రైం,జూన్16: బక్రీద్ పండుగను ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పండగను శాంతియుతంగా జరుపుకోవాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. ముస్లిం సోదరుల సామూహిక ప్రార్థనలు దృష్టిలో పెట్టుకుని ఆదివారం నగరంలో ఈద్గా ఇతర ప్రాంతాల్లోని గొల్లగూడెం ఈద్గా ప్రాంతాన్ని, త్రీటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని ప్రార్థనా ప్రాంతాలను సీపీ సందర్శించారు. ట్రాఫిక్, పార్కింగ్, భద్రతపై నిర్వాహకులతో పాటు అధికారులతో చర్చించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పార్కింగ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని పోలీసులకు సూచించారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన జిల్లాలో పండుగ పర్వదినాన్ని శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు. బక్రీద్ సందర్భంగా ఈద్గాలో ప్రార్థనకు సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకుని



ముస్లిం మతపెద్దలతో మాట్లాడుతున్న సీపీ

మునిసిపల్ అధికారులతో కలిసి సౌకర్యాలు కలిపించినట్లు తెలిపారు. ముస్లిం మతపెద్దలతో సీపీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ రమణమూర్తి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, సీఐలు రమేష్, మోహన్‌బాబు, మతపెద్దలు షేక్ అబ్దుల్ రశీద్, షరీఫ్, ఇస్మాయిల్, అజీజ్, అఫ్జల్, నజీర్, మీరా, అబ్దుల్‌రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో వాటర్ ట్యాంక్ నిర్మాణం

తిరుమలాయపాలెం, జూన్16: మండలంలోని పిండిప్రోలులో యాదవ కులస్తుల ఆరాధ్యదైవమైన మల్లిఖార్జునస్వామి గంగమ్మగుడి దేవాలయానికి రూ.65 వేలతో మంచినీటి ట్యాంక్‌ను నిర్మించారు. జక్కుల అప్పారావు, అనూషజక్కుల సురేష్, ప్రత్యూష వారి తండ్రి పెద్ద మాన్‌సింగ్ జ్ఞాపకార్థం మంచినీటి ట్యాంక్ నిర్మించారు. ఈసందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణానికి కూడా తమ వంతు సహకారం అందిస్తామన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



ఖమ్మంఖానాపురంహవేలి, జూన్16: 1984-87లో నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో బీఎస్సీ బీజెడ్సీ చదివిన పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి అనుభవాలను పంచుకుంటూ ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మమత వైద్యకళాశాలల సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ బండి గణేష్, ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయయులు కేవీకృష్ణారావు, వెంకటేష్ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, టి.ఉపేందర్‌రెడ్డి, న్యాయవాదులు గంగాధర్, రామానుజం, పీఆర్టీయూ జనరల్ సెక్రటరి రంగారావు పాల్గొన్నారు.

నేడు శ్రీఅష్టలక్ష్మీ దేవి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

ఖమ్మంకార్పొరేషన్, జూన్16: నగరంలోని మమత రోడ్‌లోని శ్రీఅష్టలక్ష్మీదేవి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవాన్ని సోమ, మంగళవారాల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం ఉదయం 9:30కు శ్రీసూక్త హోమం వేదపండితులు నిర్వహిస్తారన్నారు. అలాగే మంగళవారం ఉదయం 7గంటలకు శ్రీసూక్త హోమం ఉంటుందన్నారు. సాయంత్రం సామూహిక కుంకుమ పూజలు ఉంటాయని, వార్షికోత్సవం సందర్భంగా అన్నవితరణ ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయకమిటీవారు కోరారు.

ముగిసిన పెద్దమ్మతల్లి ఆలయవార్షికోత్సవం

కారేపల్లి జూన్16: మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆలయ 8వ వార్షికోత్సవం వేడుకలు ఆదివారంతో ముగిశాయి. చివరిరోజు మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. దీంతో మండల కేంద్రంలో సందడి నెలకొంది. ఆలయానికి విచ్చేసిన భక్తులకు పూజారి మల్లికార్జునశర్మ తీర్థాప్రసాదాలు పంపిణీ చేశారు. తోడితలగూడెంలో యాదవమహిళల ఆధ్వర్యంలో గ్రామంలో బోనాల కార్యక్రమం నిర్వహించారు.

పూర్వపు కలెక్టర్ గౌతమ్‌ని కలిసిన జడ్పీ చైర్మన్

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 16: బదిలీపై వెళ్తున్న ఖమ్మం పూర్వపు కలెక్టర్ వీపీ గౌతమ్‌ను ఆదివారం జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు కలిశారు. క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి శాలువలు, పుష్పగుచ్చాలతో అభినందించారు. జిల్లాకు మెరుగైన సేవలు అందించి జిల్లాను అగ్రపథాన నిలిపారని కొనియాడారు. వారి వెంట జడ్పీ సీఈవో వినోద్ డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి తదితరులున్నారు.

నూతన కలెక్టర్‌ను కలిసిన పసుమర్తి

కల్లూరు, జూలై 16: నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ ముజామిల్‌ఖాన్‌ను ఆదివారం తన కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు మార్యదపూర్వకంగా కలుసుకున్నారు. శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటుగా చందర్‌రావు కూడా నూతన కలెక్టర్‌ను కలుసుకోన్నారు. మంత్రి తుమ్మల చందర్‌రావును కలెక్టర్‌కు పరిచయం చేశారు.

బోడియాతండాలో బోనాల పండుగ

కొణిజర్ల, జూన్16: మండల పరిధిలోని బోడియాతండా గ్రామంలో గ్రామస్తులు ఆదివారం బోనాల పండుగను నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి, ముత్యాలమ్మ, నాభిశిల ప్రతిష్ఠ జరిగిన మూడు సంవత్సరాలు అయిన సందర్భంగా గ్రామంలోని మహిళలు పెద్దఎత్తున బోనాలు ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. వైరా ఆత్మకమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేషగిరిరావు, ఆలయ కమిటీ చైర్మన్ బానోతు వెంకన్న, లక్ష్మయ్య, ఒడిత్యా రంగా, మాజీ సర్పంచ్ బాలాజీ, వీరన్న, బిచ్చాలు, శ్రీను, వీరు, నారాయణ, రమేష్, హరిసింగ్, రాంబాబు పాల్గొన్నారు.



బోనాలుతో వస్తున్న నాయకులు

గిరిజనులపై దాడులను అరికట్టాలి

కొణిజర్ల, జూన్16: గిరిజనులపై జరుగుతున్న దాడులను రాష్ట్ర ప్రభుత్వం అరికట్టాలని గిరిజనసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం కోరారు. మండల పరిధిలోని మేకాలకుంటలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. గిరిజన బాలికలు అత్యాచారాలకు గురవుతున్నారని, దీనిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. గిరిజన హక్కుల కోసం ఈనెల 21,22న వైరాలో జరిగే గిరిజనసంఘం రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో గిరిజనసంఘం మండల అధ్యక్షుడు తేజావత్ కృష్ణకాంత్ నాయక్, అశోక్ నాయక్, బావ్‌సింగ్ పాల్గొన్నారు.

సంచారజీవులకు నిలయంగా హాస్టల్

- స్థానికేతర విద్యార్థులు లేరనే కారణంతో హాస్టల్ మూత

తల్లాడ, జూన్16: నిరుపేద విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించేందుకు నిర్మించిన ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం(హాస్టల్)భవనం సంచారజీవులకు నిలయమైంది. స్థానిక నిరుపేద విద్యార్థులున్నప్పటికీ దూరప్రాంత స్థానికేతర విద్యార్థులుండాలనే నిబంధన కారణంగా గత ఏడాది హాస్టల్‌ను మూసివేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలోనైనా పునఃప్రారంభించేందుకు చర్యలు చేపట్టకపోవడంతో హాస్టల్ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. తల్లాడ మండలం మల్లవరంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంను గత ఏడాది మూసివేశారు. గత ఏడాది 3నుంచి 10వతరగతి వరకు చదువుకునే 40మంది నిరుపేద విద్యార్థులు హాస్టల్‌లో ఉన్నారు. వీరంతా మల్లవరం గ్రామానికి చెందిన స్థానిక విద్యార్థులు. హాస్టల్‌లో దూరప్రాంత స్థానికేతర విద్యార్థులు లేకపోవడంతో గత ఏడాది దసరా సెలవుల తర్వాత హాస్టల్‌ను మూసివేశారు. హాస్టల్‌లో పనిచేసే వార్డెన్, కుక్, వర్కర్, వాచ్‌మెన్‌లకు ఇతర హాస్టళ్లలో అదనపు బాధ్యతలు



మల్లవరంలోని బీసీ బాలుర వసతి గృహం

అప్పగించారు. అప్పటి నుంచి హాస్టల్ భవనం సంచారజీవులకు నిలయంగా మారింది. ఈనెల 12 నుంచి నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటికీ హాస్టల్‌లో విద్యార్థులను చేర్పించే ప్రక్రియను చేపట్టలేదు. మల్లవరం గ్రామంలో 1నుంచి 5వతరగతి వరకు ప్రాథమిక పాఠశాల ఉంది. ఆరు నుంచి పదోతరగతి వరకు తల్లాడలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలున్నాయి. మల్లవరం నుంచి తల్లాడ వెళ్లేందుకు దూరం కావడం వల్ల హాస్టల్‌లో దూరప్రాంత స్థానికేతర విద్యార్థులను చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావడం లేదు. దీంతో మల్లవరం గ్రామానికి చెందిన స్థానిక నిరుపేద విద్యార్థులు మాత్రమే హాస్టల్‌లో చేరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు హాస్టల్‌లో విద్యార్థులకు ప్రవేశం కల్పించటంపై దృష్టిసారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కృత్రిమ పాదాల అందజేత



ఖమ్మంసాంస్కృతికం, జూన్16: గట్టయ్య సెంటర్‌లోని రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యంలో ఆదివారం 105 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ పాదాలను అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ఆఫ్ ఖమ్మం చైర్మన్ మల్లాది వాసుదేవ్,కార్యదర్శి సాంబశివరావు, క్లబ్ అధ్యక్షుడు ఎన్ రవీంద్రనాథ్ ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు గోళ్ల రాధాకృష్ణ, వికాస తరంగిణి జిల్లా అధ్యక్షుడు పోలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పద్మకు ప్రజాపంథా నాయకుల నివాళి

ఖమ్మంరూరల్,జూన్16:మండల పరిధిలోని కాచిరాజుగూడెం గ్రామానికి చెందిన సీపీఐ ఎమ్ఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా నాయకుడు మలీదు నాగేశ్వరరావు సతీమణి పద్మ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజా పంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆదివారం పద్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, అశోక్, బందెల వెంకయ్య, మనోహర్ పాల్గొన్నారు.

మాదిగల ర్యాలీని విజయవంతం చేయాలి

ఖమ్మంరూరల్, జూన్16: జూలై7న వరంగల్‌లో నిర్వహించే మాదిగల ఆత్మగౌరవ కవాతు ర్యాలీని విజయవంతం చేయాలని పాలేరు నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జీ వంగూరి ఆనందరావు పిలుపు నిచ్చారు. మండల పరిధిలోని రెడ్డిపల్లి మారెమ్మతల్లి ఆలయ ప్రాంతంలో ఆదివారం జరిగిన రూరల్ మండల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల కమిటి సమావేశంలో మాట్లాడారు.

టీయూడబ్ల్యూజే సభల ఆహ్వాన కమిటీ ఎన్నిక

ఖమ్మంసాంస్కృతికం, జూన్16: ఖమ్మంలో జరిగే తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర మహాసభలకు 150 మందితో ఆహ్వాన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఆహ్వాన కమిటీ అధ్యక్షుడిగా ప్రముఖ వైద్యుడు కూరపాటి ప్రదీప్, ప్రధాన కార్యదర్శిగా వనం వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఏనుగు వెంకటేశ్వరరావు, సలహాదారుడిగా కె.రాంనారాయణను ఎన్నుకున్నారు.

ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి పాటుపడాలి

సత్తుపల్లిరూరల్, జూన్16: ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలని వారు విన్నవించారు. ఆదివారం సత్తుపల్లి మండలం కాకర్లపల్లిలోని ఓ మామిడితోటలో ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.అనారోగ్యంతో బాధపడుతున్న దూద్దేపూడికి చెందిన ఫోటోగ్రాఫర్ వెంకటేశ్వరరావుకు ఆధ్వర్యంలో రూ.11వేలు అందజేశారు. కార్యక్రమంలో పరిమి వెంకటేశ్వరరావు, సుమాంజలి రాము,రామకృష్ణ,హరేంద్రనాథ్,కోటేశ్వరరావు, వెంకటేశ్వర రావు, పాషా, నాగేశ్వరరావు, రవి, కిషోర్, కృష్ణ, గాంధీ పాల్గొన్నారు.

వైద్యశిబిరం అభినందనీయం

వైరా,జూన్ 16: బోడేపూడి కళానిలయం ఆధ్వర్యంలో 108నెలల నుంచి క్రమం తప్పకుండా ప్రతినెలా మూడో ఆదివారం వైద్యసేవలందించటాన్ని పలువురు అభినందించారు. ఆదివారం వైరాలోని బోడేపూడి భవన్‌లో 108వ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కమ్మజన సేవసమితి అధ్యక్షుడు చింతనిప్పు వెంకటయ్య పలువురు ఈ శిబిరాన్ని సందర్శించి అభినందించారు. ఖమ్మం పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు చీకటి భారవి, పిల్లలమర్రి సుబ్బారావు వైద్యసేవలందించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారని అలాంటి వారికి ప్రతీనెలా మూడో ఆదివారం వైద్యసేవలందించటం అభినందనీయమని వెంకటయ్య, బోడేపూడి కళానిలయం కార్యదర్శి బొంతు రాంబాబు పేర్కొన్నారు. నిర్వాహకులను అభినందించారు. వైద్యపరీక్షలు చేయించుకున్న వారికి ఒకనెలకు సరిపడా మందులను రూ.వందకే అందజేశారు. మాజీ ఎంపీపీ బొంతు సమత, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, గుడిమెట్ల రజిత, మాదినేని రజిని, మోహన్‌రావు, అయిలూరి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం